# కోటయ్య-కొబ్బరి చెట్టు

ఏయ్! ఏమోయ్! చూసావా? లక్కపిడతల్లా ముద్దొచ్చె మనకొబ్బరి పుచ్చెలు ఎంత పెద్దవయ్యాయో చూసావా? ఇక కొబ్బరి బొండాలు పరువుకొచ్చాయోయ్? అంటూ బడి నుంచి తిరిగి వచ్చిన కోటయ్య పరుగులాంటి నడకతో పెరట్లోకి వెళ్ళి కొబ్బరి చెట్టుకు ఎదురుగా నిలబడి ఓ అరుపులాంటి పిలుపుతో పిలిచాడు.

వంటింట్లో అన్నం వారుస్తున్న భార్య కనకం అలవాటైన అరుపు లాంటి పిలుపుకు నవ్వుకుని సమాధానం చెప్పలేదు.

"ఓయ్! వినబడిందా! పనికిరాని పని ఎప్పుడూ ఉండేదే? రా! ఇటురా! అంటూ మళ్ళీ పిలిచాడు.

భర్త కోటయ్య పెరట్లో కొబ్బరి చెట్టు పెట్టింది మొదలు ఆయన అరుపులు మరింత ఎక్కువయ్యాయి. కొబ్బరి మొలక మొవ్వాకు వేసి చంద్రవంకలా తెల్లగా మెరిసి పోతూ పైకి పొడుచుకు వచ్చిన్నాడు మొదలు చెట్టు పెరిగి పెద్దదై, కాయలు పెద్దవయ్యే వరకు ఎందుకో అందుకు అరుస్తూనే ఉన్నాడు. ఆవిడ ఆ అరుపులకు భయపడక ముసి ముసి నవ్వులతో సమాధానమిస్తోంది.

అన్నం వార్చడం పూర్తి చేసి, అన్నంగిన్నె పక్కపొయ్యిమీద పెట్టి, తిరిగి ఇత్తడి సిబ్బిమూత పెట్టి, అన్నం వార్చడానికి ఉపయోగించిన పెంకు ముక్కలు పక్కన పెట్టి అప్పుడు "వస్తున్నానండీ" అంటూ చెయ్యి కడుక్కుని పమిటకొంగుతో తుడుచుకుంటూ, ఆవిడ పెరట్లోకి వెళ్లి భర్తకు పక్కగా నిలబడింది.

"ఓయ్! చూసావోయ్! కొబ్బరి బొండాలు ఇంక రెడీ!" అన్నాడు భార్యవైపు గర్వంగా చూస్తూ!

"బాగానె ఉంది సంబడం! గెలవేసాక కాయలు పెరక్కుండా ఉంటాయి టండీ! ఇంతకీ మొదటి బొండాం మీరు తాగుతారా? మీ అబ్బాయికిస్తారా?" అంది ముసి ముసిగా నవ్వుతూ.

"నీ మొహంలా ఉంది! నేను నీకొడుకూ తాగటానికే ఇంత కష్టపడి చెట్టు పెంచుతా? సంతలో బొండాలు అమ్మితే రెండుచేతులా డబ్బే! పైగా అమ్మాయి అల్లుడు మనవలు ఇంటికొచ్చారనుకో కొబ్బరి నీళ్ళు ఇచ్చామనుకో ఇంక కూల్ డ్రింకుల బాధ ఉండదోయ్!" అన్నాడు ఆవిడ మనస్సు చివుక్కుమంది. తను తాగడు ఇతరులను తాగమనడు! ఇదేం పిసనారితనమో? అందుకే ఊరికి పది మంది పిసనారి కోటయ్యా! అనే పిలుస్తారు" అనుకుంది మనస్సులో.

"ఈయనకు తగ్గకొడుకు వాడు! తండ్రి కళ్ళుకప్పి ఎలాగో అలాగ నాలుగు బొండాలు తాగకమానడు" ఆవిడ మనస్సులో అలా అనుకునేటప్పటికి నవ్వు వచ్చి పకపకా నవ్వింది.

ఆవిడ నవ్వంటే ఆయనకు చాలా యిష్టంగా రెండేసి కళ్ళతో నన్నని పలువరుసతో నుదుట న యా వై సంత ఎర్రని కుంకుమ బొట్టుతో కోలముక్కుకు, ఒకవైపు తెల్లరాళ్ళ బేసరి తళుక్కుమంటుంటే, నవ్వుతుంటే ఆవిడ ముఖం కలకలలాడి పోతుంది. ఆవిడ ముఖాన్నే చూడాలని ఉన్నా పెళ్ళానికి లోకువైపోతానన్న భయంతో దృష్టి మరల్చుకున్నాడు కోటయ్య.

"ఆ రోజు కొబ్బరి చెట్టు గెల వేసి పూత పూసినప్పుడు కొన్ని పూలు బంగారు పువ్వుల్లా నేలంతా రాలినప్పుడు భర్త ఏరి తెచ్చి పచ్చడి చెయ్యమనడం గుర్తుకొచ్చి" మరింత నవ్వింది కనకం.

"అదేమిటోయ్! ఆ నవ్వెందుకోయ్!" అంటూ చిరుకోపం తెచ్చుకున్నాడు కోటయ్య.

"అబ్బే! ఏం లేదు లెండి మీతో మాట్లాడుతూ ఇక్కడే ఉంటే వంట ఎవరు చేస్తారండీ!" అంటూ ఆవిడ మరింత నవ్వుతూ వంటింటి వైపు నడిచింది.

ఒకప్పుడు గాలివానకి పక్కింటివారి కొబ్బరి చెట్టు ఎండు మట్టలు వీళ్ళ దొడ్లోపడితే కోటయ్య వాటి ఈనెలు తీసి కొబ్బరి చీపుళ్ళు తయారు చేసి భార్యకిచ్చాడు. పైగా ఆ కొబ్బరి మట్టల్ని పాలేరుచేత కొట్టించి రెండు రోజులు స్నానాలకు వేన్నీళ్ళు కాగ పెట్టించాడు. ఆయన పొదుపుకి, తెలివికి కనకం ముక్కున వేలేసుకుంది. అప్పటి నుంచి కోటయ్య దృష్టి కొబ్బరి చెట్టు మీద పడింది.

ఒక రోజు వానలో ఓ ఎండు కొబ్బరికాయ నీటిలో కొట్టుకొచ్చింది. ఆ కొబ్బరికాయను చూడగానె అతని మనసులోని కోరిక పడగవిప్పింది.

"ఓయ్! ఏమోయ్! చూసావా! ఆ లక్ష్మీదేవే స్వయంగా వచ్చి గుమ్మంలో ప్రత్యక్షమయిందోయ్" అంటూ కోటయ్య అరిచిన అరుపుకి స్నానం చేస్తున్న కనకం చీర చుట్టుకుని బయటకు వచ్చి కంగారుగా అటు ఇటు చేసి "ఏదండీ! లక్ష్మీరావటం మేమిటండీ?" అంటూ అడిగింది. "ఇదిగో లక్ష్మీదేవి" అంటు చేతిలో ఉన్న కొబ్బరికాయను భర్త చూపించగానె భర్తకు మతి చలించిందేమోనని కనకం భయపడింది.

"ఇదిగో దీని మొలక చూడవోయ్" అంటూ మొలక చూపించాడు "ఇది చెట్టుగా పెరిగి గెలలు వేసిందనుకో ఇక మనింట్లో కనక వర్షం కురిసినట్లే! పైగా అరటి చెట్టులా ఒక గెల వేసి చచ్చిపోదోయ్! జీవితాంతం గెలలు వేస్తూనే ఉంటుంది. కొబ్బరి ఈనెలతో చీపుళ్ళు తయారు చేసుకోవచ్చు. పెళ్ళిళ్ళకు, శుభకార్యాలకు పచ్చని కొబ్బరి మట్టలు అమ్ముకోవచ్చు. కొబ్బరి బొండాలు అమ్ముకుంటే ఇంక డబ్బే డబ్బు. కొబ్బరి కాయ దేవునికి కొట్టి పచ్చడి చేసుకోవచ్చు! కొబ్బరి చిప్పలు ఎండ బెట్టి నూనె ఆడించుకోవచ్చు! ఆ నూనె వాడుకోవచ్చు, అమ్ముకోవచ్చు! కొబ్బరి పీచు వల్ల ఎన్ని లాభాలు?" అంటు ఆయన గుక్కతిప్పుకోకుండా చెబుతుంటె ఆవిడ ఆయనకు మతి చలించిందనుకుని చీరకట్టుకోడానికి లోపలికి వెళ్ళిపోయింది.

ఆయన ఆ కాయను నీళ్ళతో కడిగి తుడిచి పసుపు కుంకుమలు పెట్టి, పెరట్లో ఓ మూల పాలేరు చేత తవ్వించి కొబ్బరి కాయ మొలక పైకి వచ్చేటట్టు పాతించి భార్య చేత హారతిప్పించాడు. భర్త విపరీత ధోరణికి నవ్వుకుంటూ ఆవిడ ఆయన చెప్పిన పని కాదనడమెందుకని చేసేసింది. అప్పటి నుంచి కోటయ్య బడి నుంచి ఇంటికి వస్తే చాలు కొబ్బరి చెట్టు ముందే నిలబడి చూసుకుంటున్నాడు.

కనకం కళ్ళ ముందు గతం కదులుతుంటే వంట పూర్తి చేసి భర్తను బోజనానికి పిలిచింది. రెండు సార్లు పిలిచినా ఆయన పలకలేదు. ఆవిడే పేరట్లోకి వచ్చి చూసి ఆశ్చర్యపోయింది.

"ఇంకా ఇక్కడే నిలబడి ఏం చేస్తున్నారండీ?" అంటు అడిగింది.

"ఏం లేదోయ్! కొబ్బరిచెట్టు ఎలా ఎక్కి కాయలు కొయ్యాలా? అని ఆలోచిస్తున్నానోయ్!" అన్నాడు.

"అంతగా ఆలోచించడం దేనికండి? పాలేరు చెట్టు యెక్కి కోస్తాడు లెండి?" అంది నవ్వుతూ.

"వాడి సంగతి నీకు తెలీదు? రెండు కాయలు కొయ్యమంటే నాలుగు తెంపి పడేస్తాడు?" అన్నాడు కోపంగా. కోటయ్య కాలి మడమలకు బందం ఎక్కించుకుని చెట్టు ఎక్కడానికి ప్రయత్నించాడు.

"అయ్యగారు కొబ్బరి చెట్టు ఎక్కడానికి కాలికి బందం అక్కరలేదండీ! నే ఎక్కిచూపించనా?" అన్నాడు అప్పుడే అక్కడకు వచ్చిన పాలేరు ఎంకన్న.

"నీ పని నువ్వు చేసుకో? పో! పో!" అంటు వాణ్ణి కసిరి కాలిబందం తీసేసి చెట్టు ఎక్కబోయాడు.

"అయ్యో! అయ్యో! అదేంపనండీ!" అని ఆవిడ అంటుండగానె ఒక్క అడుగు మాత్రం పైకి పాకగలిగిన కోటయ్య జారి నేల మీద దబ్బున పడ్డాడు. ఆవిడ ఆ బరువు మనిషి లేవ తియ్యలేక పోయింది.

"అయ్యో! అయ్యగారు జారి పడ్డారా!" అంటూ పాలేరు లేవతీసాడు.

కోటయ్య చొక్కా చిరిగింది. మో చేతులు, మోకాళ్ళు కాస్త గీరుకుని రక్తం చిమ్మాయి.

"అయ్యా ఇదేం పనండి! నిచ్చెనేసుకుని ఎక్కచ్చు కదండీ!" అంది మందలింపుగా.

దెబ్బలనొప్పి మరచిపోయి కోటయ్య చురుగ్గా లేచి నిచ్చెన కోసం అటు ఇటు చూసాడు.

"ముందు భోజనం చేసి చల్లబడ్డాక చెట్టు ఎక్కుదురుగాని" అంటూ ఆవిడ తిరిగి వంటింటి వైపు నడిచింది. ఈసారి ఆవిడ సలహా కోటయ్యకు బాగా నచ్చింది. కాళ్ళు చేతులు కడుక్కుని మడిపంచె కట్టుకుని భోజనం చేసి కాసేపు గదిలో మంచం మీద నడుం వాల్చాడు. ఓ కునుకు పట్టిందో లేదో తిరిగి లేచాడు. గడియారం సాయంకాలం 4 గం॥ కొట్టిన శబ్దమయింది. చూరుకు కట్టిన నిచ్చెన విప్పి తెచ్చుకుని కొబ్బరి చెట్టుకు వేశాడు. అది చూసి కనకం ఏం ప్రమాదం తెచ్చుకుంటాడోనని భయపడి అక్కడకు చేరుకుంది.

అప్పుడే కాలేజీలో ఇంటర్ చదువుతున్న కొడుకు సత్తిపండు ఇంటికి వచ్చి నిచ్చెనెక్కుతున్న తండ్రిని చూసి అక్కడకు చేరాడు. తండ్రి కంట పడకుండా కొన్ని బొండాలు దాచెయ్యాలని అతని కోరిక. తెల్లారితే కూతురు సుందరి పిల్లల్ని తీసుకుని భర్తతో శలవులకి వస్తోంది. అందుకే ముందుగానె కొబ్బరి బొండాలు తీసి ఉంచాలని

కోటయ్య తాపత్రయం. కోటయ్య నిచ్చనెక్కి గెల అందుకున్నాడు. ఆయనకు చెప్పలేని సంతోషంతో ఆకాశాన్ని అందుకున్నాను అనుకున్నంత ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

సత్తిపండు పెద్ద కత్తి అందించాడు. కోటయ్య కత్తితో బరువుగా వెయ్యగానే నాలుగు బొండాలు రాలి నేలమీద పడ్డాయి.

"ఎన్ని పడ్డాయ"ని కోటయ్య కంగారుగా అడగ్గానె మూడు మూడు అంటు ఒక బొండాన్ని దాచేసిన తల్లీ కొడుకులు ఒకేసారి అరిచారు.

"నాలుక్కాదా?" అని మరో దెబ్బ వెయ్యగానె మరో నాలుగు బొండాలు నేలరాలాయి.

"ఈసారి భర్త అడక్కుండానే" మూడు మూడు" అంటూ కనకం గట్టిగా అరిచింది.

"అమ్మాయివాళ్ళు నలుగురే కదా! అయితే చాలు" అంటూ ఆయన నిచ్చెన మెల్లిగా దిగి కత్తిని కొడుక్కి అందించాడు.

కోటయ్య కాయలు లెక్కపెట్టి 'ఆరేనా' అంటూ చెట్టు గెలవైపు చూస్తున్నాడు.

"అంతే మరీ! నాలుగు కాయలు రాలుతూ ఆయన నెత్తినపడి నేలకు జారాయి! అవి ఆయన చేతి కత్తి దెబ్బకు తెగినవే! ఆయన నోట మాటలేక కుప్పలా నేలమీద పడిపోయాడు. తల్లీ కొడుకులు ఘొల్లున ఏడ్చారు. బయట పెరట్లో ఉన్న పాలేరు పరుగున వచ్చాడు. అందరు కలిసి సాయం పట్టి హాల్లో మంచం మీద పడుకోపెట్టారు. తలమీద వస్తున్న రక్తం తుడిచి తడిగుడ్డవేసారు. ఆయన ముఖాన చన్నీళ్ళు జల్లి, మంచినీళ్ళు తాగించపోయారు. ఆయన కళ్ళు విప్పలేదు. నోట మాట లేదు. నీళ్ళు తాగలేదు. డాక్టరు వచ్చి చూసి "తలకు బలమైన దెబ్బ తగిలింది కాని ప్రాణ భయం లేదు. రాత్రికి స్పృహ రావచ్చు!" అంటూ మందులు రాసిచ్చి తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు.

మరునాడు కూడా ఆయన కళ్ళు తెరవలేదు. కూతురు, పిల్లలు, అల్లుడు వచ్చి కోటయ్యను చూసి కాసేపు బాధపడ్డారు. తరువాత కొబ్బరి బొండాల నీరు చల్లగా తాగారు. వారితోపాటు సత్తిపండు తాగాడు. మూడవరోజు ఆయన మామూలు స్థితికి వచ్చి కళ్ళు తెరిచాడు. డాక్టరు ఆయనకు కొబ్బరి నీళ్ళు బాగా తాగించమన్నాడు. ఆయన లేచి కూర్చోగలిగాడు.

"కనకం ఆయనకు కొబ్బరి నీళ్ళ గ్లాసు అందించింది.

"కనకం! నువ్వు కూడా తాగు! కడుపులో చల్లగా ఉంటుంది?" అన్నాడు చిరునవ్వుతో.

"నిజంగానే భర్తకు ఇప్పుడు మతిపోయినట్టే! అనుకుంది కనకం. ఆవిడ కూడా భర్త ఎదురుగా హాయిగా తాగింది.

మరునాడు బయట పెరటి వండాలో కుర్చీవేసి కోటయ్యను కూర్చో పెట్టమన్నాడు డాక్టరు. డాక్టరు చెప్పినట్లుగా ఆయన్ను మెల్లిగా నడిపించుకు వచ్చి వరండాలో వాలుకుర్చీలో కూర్చో పెట్టారు. ఆయనకు ఎదురుగా ఒక్క కాయలేని కొబ్బరిచెట్టు కనబడుతోంది. అది చూసి కోటయ్య అరిచి, అల్లరి చేస్తాడని కనకం, సత్తిపండు చాలా భయపడ్డారు.

"కొబ్బరి బొండాలన్నీ తీయించుకుని చల్లగా తాగారా? కడుపులో చల్లగా ఉంటుంది. చెట్టు బొండాలన్నీ అయిపోయాయని అనుకోకండి! అదిగో ఆ పక్కన మరొక గెల వేస్తోంది?" అంటూ చిరునవ్వుతో చెప్పిన కోటయ్య మాటలకు అందరూ విస్తుపోయారు.

"అమ్మా! నాన్న ఇంతగా మారిపోయాడేమిటే?" అంటూ కూతురు, కొడుకు తల్లి చెవిలో గుసగుసలాడారు. అప్పుడే అక్కడకు వచ్చిన డాక్టర్ని అందరు కోటయ్యలోని మార్పునకు ఆశ్చర్యపోతూ అడిగారు.

"తలకు బలమైన దెబ్బతగలడం వల్ల కొంతమందికి మతే భ్రమిస్తుంది. కొంతమందికి జ్ఞాపకశక్తిపోయి, మాటరాదు. ఈయనకు ఆధ్యాతిక దృష్టికలిగింది. మంచి మార్పు వచ్చింది" అంటూ డాక్టరు కోటయ్యకు వినబడకుండా వివరించాడు.

"కొబ్బరి చెట్టే తన కాయలతో ఆయన నెత్తిన మెత్తి ఆయనలో మంచి మార్పు తీసుకువచ్చింది. మా కుటుంబానికి మంచి మేలు చేసింది" అనుకున్న కనకం ముసి ముసి నవ్వులు నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు కనకం?" అంటూ కోటయ్య భార్య ముఖంలోకి ఆప్యాయంగా చూస్తూ చిరునవ్వు చిందించాడు.

[redacted] జూన్-2008